క్లుప్తంగా

23 నుంచి డీఈడీ వెబ్ ఆప్షన్లు

తిమ్మాపూర్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్– 2024 ఉత్తీర్ణులై, ఒరిజినల్ సర్టిఫికెట్లు పరిశీలన చేసుకున్న అభ్యర్థులు డీఈఎల్, డీపీఎస్ఈ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 23 నుంచి వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని కరీంనగర్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ మొండయ్య తెలిపారు. 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాలని పేర్కొన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోలేకపోయినవారు ఈనెల 21న తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని డైట్ కళాశాలకు రావాలని సూచించారు. వివరాలకు డీసెట్ వెబ్‌సైట్‌లో సందర్శించాలని తెలిపారు.

మహా సమ్మేళనం విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ నాయకులు

హుజూరాబాద్‌రూరల్: హైదరాబాద్‌లో నవంబర్ 3న నిర్వహించనున్న ధర్మ సమాజ్ పార్టీ మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు తాళ్ల నరేశ్ కోరారు. సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాల జీవితాలు మార్చడానికి డీఎస్పీ రాజకీయ వేదిక అయ్యిందని, పార్టీ నిర్మాణం, సమీక్ష, భవిష్యత్ కార్యాచరణ కోసం మహా సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బాబు, గాజుల రవి, జిల్లాల సురేశ్, సందీప్, రవితేజ తదితరులు ఉన్నారు.

అనుమతిలో జాప్యం తగదు



అధికారులకు విన్నవిస్తున్న యజమానులు

చొప్పదండి: ఇంటి నిర్మాణ అనుమతులపై నిర్లక్ష్యంతో మానసిక క్షోభ అనుభవిస్తున్నామని పలువురు గృహ నిర్మాణదారులు వాపోయారు. ఈమేరకు శుక్రవారం నీటిపారుదల శాఖ అధికారులను కలిసి వినతిపత్రం అందించారు. పట్టణంలో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవల నీటి పారుదలశాఖ అధికారుల క్లియరెన్స్‌ను జత చేసింది. రెండు నెలలుగా అనుమతుల కోసం అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని వివరించారు. పలుమార్లు మోకాపై విచారణ జరిపి, నిబంధనల మేరకు అనుమతి ఇవ్వాల్సిన అధికారులు జాప్యం చేయడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరగా అనుమతులివ్వాలని కోరారు.

చెరువు మత్తడి పరిశీలన



మత్తడిని పరిశీలిస్తున్న ఏఈ రాజ్‌కుమార్

గన్నేరువరం: మండలంలోని మాదాపూర్ గ్రామ చెరువు మత్తడిని నీటిపారుదలశాఖ ఏఈ రాజ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు కుడి కాల్వ నుంచి వచ్చే సాగునీరు ఉపకాల్వ 8 ద్వారా చెరువులోకి వెళ్లేందుకు మైనర్ కాల్వ ఏర్పాటు చేశారు. కాలువలో భాగంగా సుమారు 90 మీటర్ల దూరం పైపులైన్, మత్తడి నిర్మాణానికి సంబంధించి పరిశీలన చేసినట్లు ఏఈ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు మల్లేశం, సోషల్ మీడియ మండల ఇన్‌చార్జీ మల్లారెడ్డి, పెరెజి రాజు పాల్గొన్నారు.

'సహకార' రుణాలు వినియోగించుకోవాలి

చిగురుమామిడి: వ్యవసాయంపై ఆధారపడిన ప్రతి రైతు సహకార కేంద్రబ్యాంకు అందించే స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కేడీసీసీబీ ఫీల్డ్ ఆఫీసర్ అనిల్ రెడ్డి కోరారు. శుక్రవారం బొమ్మనపల్లి దర్గా చౌరస్తా వద్ద రైతులతో అవగాహన సమావేశం నిర్వహించారు. స్వశక్తి సంఘాల్లోని ప్రతి మహిళా రాయడం, చదవడం నేర్చుకోవాలని, రుణాలతో ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. డెయిరీ, కోళ్లపెంపకం, ఎడ్యుకేషన్, ఇతర లోన్స్ ఇస్తున్నామని చిగురుమామిడి కేడీసీసీబీ మేనేజర్ అనిత తెలిపారు. స్టాఫ్‌అసిస్టెంట్ రజిత, గోల్డ్ అప్రైజర్ రామ్మూర్తి పాల్గొన్నారు.

20న అలయ్ బలయ్

శంకరపట్నం: తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలో 20న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ కోరారు. వంకాయగూడెంలో శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. గద్దపాక విండో చైర్మన్ తిరుపతిరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు విజయ్‌కుమార్‌రెడ్డి, కిషన్‌రావు, సమ్మయ్య, రాజయ్య, భద్రయ్య, పర్శరాములు, రాజు,రవి ఉన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



శంకరపట్నం: మాట్లాడుతున్న సీడీపీవో శ్రీమతి,



ఇల్లందకుంట: పరీక్షలు చేస్తున్న డాక్టర్ తులసీదాస్

శంకరపట్నం: పోషకాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని, గర్భిణులు పోషకవిలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సీడీపీవో శ్రీమతి అన్నారు. మండలంలోని కన్నాపూర్, కొత్తగట్టు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సభ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను చిన్నారులు, బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. మండల ప్రత్యేక అధికారి నాగార్జున,ఎంపీడీవో ప్రభాకర్, సూపర్‌వైజర్లు కవిత, స్రవంతి, అంగన్‌వాడీ టీచర్లు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం అంగన్‌వాడీ కేంద్రాలతోనే సాధ్యమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. మండలంలోని టేకుర్తి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్, పోషణమాసం, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు తులసీదాస్, కళ్యాణ్ విద్యార్థులకు వివిధ పరీక్షలు చేశారు. పిల్లల ఎదుగుదలకు మంచి పౌష్టికాహారం అందించాలని తల్లులకు సూచించారు. ఎంపీఓ రాజేశ్వర్‌రావు, ఏఎన్ఎం రాజశ్రీ, ఆశా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్: కాంగ్రెస్ రైతు పక్షపాతి ప్రభుత్వమని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గంగిపల్లి లో మానకొండూర్ విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన 150 మెట్రిక్ టన్నుల గోదాంను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు సొసైటీ పాలకవర్గం, గ్రామస్తులు నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పనిచేస్తుందని, ప్రతిపక్షాలు అనవసర ఆరోపణలు చేస్తున్నాయని, పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం మాఫీ చేయలేక పోయిందని మండిపడ్డారు. సొసైటీ అధ్యక్షుడు గోవిందరెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు తిరుమల్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు అంజుత్‌రావు, తిరుపతిరెడ్డి, సుధారాణి, తిరుపతి, సత్యనారాయణ, నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: ఎల్ఎండీకాలనీలోని దుర్గాబాయి మహిళా శిశు కేంద్రం(మహిళా ప్రాంగణం)లో మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే అన్నారు. మహిళా శిశు కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. వసతిగృహం ఏర్పాటుకు సంబంధించిన అంచనాలను వెంటనే అందిస్తే ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానని అధికారులతో అన్నారు. వెంట విద్యా, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక ఇంజినీర్ అనితా సింగనాథ్, సీనియర్ అసిస్టెంట్ సుధా, అకౌంటెంట్ రాజాకిషన్‌రెడ్డి, వార్డెన్లు రేణుక, తిరుమల ఉన్నారు.

ఎంబీఏ విద్యార్థినికి చేయూత

మండలంలోని బాలయ్యపల్లి గ్రామ పంచాయతీ పరిధి సాయబ్‌పల్లెకు చెందిన ఎంబీఏ విద్యార్థిని కామెర సమతకు ఎమ్మెల్యే చేయూతనందించారు. నేతకాని సామాజిక వర్గానికి చెందిన సంపత్ కూతురును కరీంనగర్‌లోని నిగమ కళాశాలలో ఎంబీఏ చదివిస్తున్నాడు. ఫీజు కట్టలేని పరిస్థితిలో ఆమె కాలేజీ మానేసింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రథమ సంవత్సరానికి సంబంధించిన ఫీజు మొత్తాన్ని సమతకు అందజేశారు. భవిష్యత్‌లో చదువుకు ఆర్థికసాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు సమత కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, జి.రాజేందర్ రెడ్డి, టి.రాజేందర్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మణ్, కొత్త తిరుపతిరెడ్డి, ఆసిఫ్‌పాషా పాల్గొన్నారు.

'కొనుగోళ్లలో రాజకీయం'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి

మానకొండూర్: అన్నిరకాల వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గ కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. వర్షాలతో పంటలు పాడవుతుంటే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంలేదని, అక్కడక్కడా ప్రారంభించినా సదుపాయాలు కల్పించడంలేదని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రాజకీయ చేస్తున్నారని, వచ్చేవరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించొద్దని ఆదేశాలు జారీ చేయడం సరికాదన్నారు. సొసైటీల చైర్మన్లను ఎమ్మెల్యే బెదిరిస్తుండటంతో మానసిక క్షోభకు గురవుతున్నారని దీన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. 20న తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి సాయిగార్డెన్‌లో నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, కౌషిక్‌రెడ్డి, మాజీ ఎంపీ వినోదకుమార్ హాజరవుతున్నారని కార్యకర్తలందరూ భారీగా తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సిద్దం వేణు, మాజీ సర్పంచ్ రామంచ గోపాల్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా ఎగ్గొట్టినట్టేనా..?



ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి కాంగ్రెస్ పాలనలో రైతులకు తంటాలు తప్పడం లేదని, కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బూర్గుపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. బోనస్ మాట బోగస్, రైతుభరోసా ఎగ్గొట్టినట్టేనా అని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభంకాక మద్దతు ధరకు అమ్ముకోవాల్సిన ధాన్యాన్ని రైతులు తక్కువ ధరకే వ్యాపారులకు విక్రయిస్తున్నారని, అన్నిరకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని లేదంటే ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సభ్యత్వ నమోదులో వేగం పెంచాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నాయకులు

జమ్మికుంట: మండలంలోని గ్రామాల్లో బూత్‌కు 200 సభ్యత్వాలు చేయించాలని బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని నాగంపేటలో శుక్రవారం సభ్యత్వ నమోదుపై నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశం మాట్లాడారు. ప్రపంచంలో బీజేపీ అతిపెద్ద సభ్యత్వ నమోదు చేసిన రాజకీయ పార్టీ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్ శ్యామ్, నాయకులు ఆకుల రాజేందర్, శీలం శ్రీనివాస్, పుల్లూరి ఈశ్వర్, యంగల లింగమూర్తి, రావుల సంపత్, నరసింహారెడ్డి, నాగపూరి విక్రమ్, శంకర్, తిరుపతి, సమ్మయ్య, గణేశ్, మల్లేశ్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని ముత్తారం గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదును ఎస్సీ మోర్చారాష్ట్ర కార్యదర్శి జాడిబాల్‌రెడ్డి ప్రారంభించారు. ఎస్సీ కాలనీలో క్యాంపు నమోదు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్సీమోర్చా మండల అధ్యక్షుడు కనకం సాగర్, మహేశ్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ కమిటీలతో ఒరిగేదిలేదు'

వీణవంక: ఇందిరమ్మ కమిటీల ఎంపిక కోసం గ్రామ కమిటీలు, మున్సిపాలిటీలో వార్డు కమిటీలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకే ఎక్కువగా నష్టాలు జరుగుతాయని జనతాదళ్(సెక్యూలర్) పార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడారు. ప్రజల స్థితి గతులకు సంబంధించిన సామాజిక ఆర్థిక సర్వే రిపోర్ట్ ఆధారంగా గ్రామసభలు నిర్వహించి నిజమైన అర్హులను ఎంపిక చేయాలని ప్రశ్నించారు. కమిటీ సభ్యులు అర్హులను గుర్తించడంలో విఫలమైతే ఎవరు బాధ్యత వహిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ, మున్సిపాలిటీ సభల ద్వారానే ఎంపిక చేస్తే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని ఇకనైనా ప్రభుత్వం పునరాలోచన చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఫీజు బకాయిలు చెల్లించాలి

హుజూరాబాద్‌రూరల్: రాష్ట్రంలోని ప్రైవేట్ విద్యాసంస్థలకు సంబంధించి పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నగర హాస్టల్స్ కన్వీనర్ అభిలాష్ కోరారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసి సమావేశంలో మాట్లాడారు. రీయింబర్స్‌మెంట్ సకాలంలో చెల్లించకపోవడంతో విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, చదువు పూర్తయినా సర్టిఫికెట్లు అందక ఉద్యోగాలు పొందడం లేదన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని బకాయిలు చెల్లించాలన్నారు. సమావేశంలో నగర సంయుక్త కార్యదర్శి బొంతల సిద్దు, పుట్టపాక అజయ్, మంతెన జస్వంత్ తదితరులున్నారు.

హెల్త్‌కార్డులు జారీ చేయాలి

హుజూరాబాద్‌రూరల్: ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హెల్త్‌కార్డులను మంజూరు చేయాలని తెలంగాణ ఉద్యోగుల గెజిటెడ్ ఆఫీసర్స్, నాన్ గెజిటెడ్ టీచర్స్, పెన్షనర్ల, కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ శుక్రవారం ప్రకటనలో కోరారు. హెల్త్‌కార్డులతో అన్నిరకాల వైద్య సేవలు పొందే వీలుంటుందని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానం పునరుద్దరించాలన్నారు.


ఎయిడ్స్ నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పీహెచ్ఎన్ బాలసారి

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు పద్మపాణి సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎన్ఎం సత్య, పీహెచ్ఎన్ బాలసారి హెచ్ఐవీ వ్యాప్తి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపొద్దని, క్షయ, ఇతర వ్యాధులు, చికిత్స తదితర విషయాల గూర్చి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం జగదీశ్, కార్యదర్శి శ్రీనివాస్, సొసైటీ లింక్‌వర్కర్ భోగం రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్ బీసవేని రాజమణి, ఆశా కార్యకర్త రజిత పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా బంద్



జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లి, మండలంలోని మాచనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని రూరల్ ఏఈ రమేశ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 5 గంటల వరకు సరఫరా నిలిపి వేయనున్నామని వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నియామకం



అనుమాండ్ల కిషోర్

గన్నేరువరం: తెలంగాణ మీ సేవా ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మండలంలోని జంగపల్లి గ్రామానికి చెందిన అనుమాండ్ల కిషోర్ నియామకమయ్యారు. జంగపల్లిలో ఎనిమిదేళ్లుగా మీ సేవ కేంద్రం నిర్వహిస్తున్నాడని, నియామకం పట్ల జిల్లాలోని పలు మీ సేవా నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

పీఏసీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా లక్ష్మారెడ్డి



పాకాల లక్ష్మారెడ్డి

మానకొండూర్: పీఏసీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మానకొండూర్ విశాల సహకార పరపతి సంఘం సీఈవో పాకాల లక్ష్మారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి పాటు పడుతానని లక్ష్మారెడ్డి తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ గ్రామ అధ్యక్షుడు కర్రె దేవరాజ్ అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముసిపట్ల తిరుపతిరెడ్డి, తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి



రమ్యకృష్ణ(ఫైల్)

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన వివాహిత అలువాల రమ్యకృష్ణ (28) హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ నెల 13న రాత్రి భర్త అలువాల విష్ణు (జాతీయ యువజన అవార్డు గ్రహీత)తో కలిసి జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రానికి గ్రామం నుంచి బైక్‌పై వెళ్తుండగా మ్యాకవెంకయ్యపల్లి గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా మరో బైక్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో రమ్యకృష్ణ కోమాలోకి వెళ్లగా భర్తకు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రైవేట్ వైద్యశాలకు అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందిందన్నారు. ఆమె మృతిపట్ల పలువురు రాజకీయ నాయకులు, గ్రామస్తులు సంతాపం తెలిపారు.



హుజూరాబాద్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని కాకతీయ కాలనీలో నివాస గృహాల మధ్యలోని ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో కాలనీవాసులను ఇబ్బందులకు గురవుతున్నారు. పిచ్చిమొక్కలు కుక్కలు, పందులు, కోతులకు ఆవాసంగా మారుతున్నాయి. అలాగే దోమలు వృద్ధి చెందుతుండటంతో అనారోగ్యానికి గురవుతున్నామని సమస్యను వెంటనే పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సమ్మయ్య, హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్, సెల్ నంబర్: 70326 51516

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9393557752

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- మెప్మా పీడీ స్వరూపారాణి
- ఇందిరా మహిళా శక్తి పథకంలో క్యాంటీన్ ప్రారంభం



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న పీడీ స్వరూపారాణి, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న, తదితరులు

జమ్మికుంట: మహిళలు ఆర్థికంగా ఎదగాలని మెప్మా పీడీ స్వరూపారాణి, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నకోటి అన్నారు. పట్టణంలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మంజూరైన క్యాంటీన్‌ను శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కోటిమంది మహిళలు కోటీశ్వరులు అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టగా ఇందిరా మహిళా శక్తి కింద శ్రీలక్ష్మి సమైఖ్య సంఘం సభ్యులు గ్రూపుగా క్యాంటీన్ మొదలుపెట్టడం అభినందనీయమని అన్నారు. గ్రూపు, వ్యక్తిగత యూనిట్ల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. గతంలో ఏర్పాటు చేసిన యూనిట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రాజిరెడ్డి, డీఎంసీ శ్రీవాణి, కౌన్సిలర్లు సాయిని రమ, మారపల్లి భిక్షపతి, బొంగోని వీరన్న, దేశిని రాధాసదానందం, ఎలగందుల స్వరూపశ్రీహరి, మెప్మా ఇన్‌చార్జి టీఎంసీ మానస, సీఎల్ఆర్పీలు జ్యోతి, మంజుల, ఆర్పీలు విజయ, అనూష పలువురు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



మాట్లాడుతున్న ముకుందరెడ్డి, నాయకులు

శంకరపట్నం: కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ముకుందరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని కేశవపట్నంలో శుక్రవారం సీపీఎం మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. తూకంలో మోసంపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రాజిరెడ్డి, వాసుదేవ్, చక్రపాణి, తిరుపతి, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

వీణవంక: కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కన్వీనర్ పిల్లి రవియాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడారు. వరి కోతలు ముమ్మరంగా సాగుతుంటే ఇప్పటివరకు కేంద్రాలను ఏర్పాటు చేయ డం లేదని, వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం తడుస్తుందని, రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సన్నరకంతో పాటు దొడ్డు రకం ధాన్యానికి బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి కొర్రీలు పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలని లేదంటే రైతుల పక్షాన ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

గన్నేరువరం గౌడ సంఘం



గౌడ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

గన్నేరువరం: గన్నేరువరం గౌడ సంఘం ఎన్నికలు శుక్రవారం మండల కేంద్రంలోని కౌండిన్య వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో నిర్వహించారు. 108 మంది సభ్యులుండగా 99 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. బుర్ర తిరుపతిగౌడ్‌కు 52, బుర్ర లక్ష్మీరాజంకు 47 ఓట్లు పోలయ్యాయని ఎన్నికల నిర్వాహకుడు పురుషోత్తం కిషన్ తెలిపారు. అధ్యక్షుడిగా బుర్ర తిరుపతిగౌడ్, ఉపాధ్యక్షుడిగా బుర్ర తిరుపతిగౌడ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్‌గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారిగా మల్లేశంగౌడ్, సహాయ కార్యదర్శిగా రాములు ఎన్నికయ్యారు. అనంతరం వీరిని గౌడ సంఘం సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు రాజయ్య, లక్ష్మీరాజం, అంజయ్య, నాగుల కనుకయ్య, బుర్ర మల్లేశం, రాజ్‌కోటి, సత్తయ్య, నర్సయ్య, జంపయ్య, నర్సయ్య, శ్రీకాంత్, మల్లయ్య, నల్లగోని మల్లయ్య, మునిగాల పర్శరాం, కందల నర్సయ్య, ఇక్కుర్తి పర్శరాంగౌడ్స్ పాల్గొన్నారు.

మళ్లీ ఎలుగుబంట్ల సంచారం

గన్నేరువరం: మండలంలో పదిహేను రోజులుగా ఎలుగుబంట్ల సంచారంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జంగపల్లి ఎల్లమ్మగుడి, గునుకులకొండాపూర్ నుంచి పీచుపల్లి వెళ్లే రోడ్డుపై ఎలుగుబంట్లు ప్రత్యక్షమవుతున్నాయని, గతంలో దాడి సంఘటనలు ఉన్నాయని తెలిపారు. చెట్ల పొదల్లో ఉండటంతో కనిపెట్టలేక పోతున్నామని, ప్రజలు భయంభయంగా జీవిస్తున్నారని, ఫారెస్ట్ అధికారులు స్పందించాలని పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు గుంటుక లింగయ్య కోరారు.

ఒకరిపై కేసు

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన ముత్యాల రజనీపై శుక్రవారం కేసు నమోదు చేశామని ఎస్సై తాండ్ర నరేశ్ తెలిపారు. చొప్పదండిలోని ఓ స్కూల్‌లో కుమారుడికి సీటు ఇప్పిస్తానని రజనీ రూ.75 వేలు తీసుకొని సీటు ఇప్పించకపోగా డబ్బులు తిరిగి ఇవ్వలేదని కరీంనగర్‌కు చెందిన వడ్లకొండ వాణి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కర్రె దేవరాజ్ అనారోగ్యంతో మృతి చెందాడు. దహన సంస్కారాలకు మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి రూ.పదివేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గోనెల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి ముద్దసాని శ్రీనివాస్, కొలిపాక రామస్వామి, పూదరి రమేశ్, ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యాక్షులు పల్లెర్ల కిరణ్‌గుప్తా, దూలం నరేశ్ ఉన్నారు.